# నేరం చేయని నిందితుడు

**సం**పూర్ణ మద్య నిషేధం అమలులో ఉన్న సమయంలో మద్రాసు నగరంలో జరిగిన ఒక దయనీయ సంఘటన ఈ కథకు ఆధారం. చట్టం మనుషుల కొఱకేగాని, మనుషులు చట్టం కొఱకు కాదన్న పరమార్థం నియమపాలకులకు అర్థమైన రోజునే ఇటువంటి దారుణ సంఘటనలు జరగకుండా ఉంటాయి.

రసూల్ మంచివాడైన ఒక ఆటో డ్రైవర్. ఆటో డ్రైవర్లగూర్చి సదభిప్రాయం కలగటం ఒక అసాధారణమైన విషయం. ప్రజలమధ్య రకరకాల అభిప్రాయాలుండటం ఈ ప్రజాస్వామ్య దేశంలో వాక్స్వాతంత్ర్యం ఉన్నదనే విషయాన్ని చాటిచెప్పే ఒక దృష్టాంతం. బాంబే మద్రాసు నగరాల్లో ట్రాఫిక్ కట్టుదిట్టంగా ఉంటుందనీ, హైద్రాబాద్‌లో అధ్వాన్నంగా ఉంటుందనీ, కలకత్తా నగరంలో బొత్తిగా అన్యాయమనీ చాలామంది అంటూ ఉంటారు. ఇదేవిధంగా ఆటోరిక్షాల విషయం చెప్పేటప్పుడు ఢిల్లీలోని ఆటోరిక్షావాళ్ళు, అదీ సర్దార్జీలు ఢిల్లీ ముఖమెరగని ప్రయాణీకుల్ని తిప్పితిప్పి డబ్బు గుంజుతారు. బాంబే ఆటోరిక్షా వాళ్ళు మీటర్ ప్రకారమే డబ్బు వసూలు చేస్తారనే ఒక మంచి అభిప్రాయం ఉంది. హైద్రాబాద్‌లో మంచి ఆటోవాళ్ళూ ఉన్నారు, దోపిడీ వాళ్ళూ ఉన్నారు. మద్రాసులోని ఆటోవాళ్ళు చాలా మంచివాళ్ళని, మద్రాసులో నివశించని వాళ్ళు అంటుంటారు. ఒకరోజు రాత్రి పదిగంటలకు మీనంబాకం ఏర్‌పోర్ట్‌లో దిగిన నేను ఇండియన్ ఏర్‌లైన్స్ వారి వాహనంలో సిటీకి వెళ్లాను. పదకొండింటికి ఒక ఆటోరిక్షాలో కూర్చొని నుంగంబాకంలోని ఫలానా ఇంటికి పోవాలని చెప్పినప్పుడు ''సార్, ఇంతరాత్రి అయిందిగదా; మీటర్ చార్జికాక అదనంగా ఏభై పైసలు ఇస్తారా'' అని దయనీయంగా అడిగినప్పుడు నాకెంతో ఆశ్చర్యం కల్గింది. అంతరాత్రి వేళల్లో ఇతర ప్రాంతాల్లో అయితే డబుల్ చార్జీ వసూలు చేస్తారు. నన్ను

గమ్యస్థానానికి చేర్చి, నా సూట్‌కేసును ఇంటిలోకి తెచ్చాడు మర్యాద రామన్న. ఎంతైదని నేను అడిగినప్పుడు మూడు రూపాయలైందని చేతులు జోడించి చెప్పాడు. ఒక అయిదు నోటు అతని చేతుల్లో పెడితే ఎంతో సంతోషంతో, వినయంతో పాదాలకు నమస్కరించినంతగా చేసి వెళ్ళిపోయాడు. ఎంత మంచి ఆటోరిక్షా సారథి!

ఇటువంటి ఒకమంచి ఆటోరిక్షా సారథి రసూల్. ఎక్కువగా అతను సెంట్రల్ స్టేషన్‌ముందే ఉంటాడు. రోజూ అక్కడకు వచ్చే ప్రయాణీకుల్ని వాళ్ళ గమ్యస్థానాలకు సురక్షితంగా తీసుకువెళ్తాడు. ఎల్లప్పుడూ నవ్వుతూ మాట్లాడటం అతని అలవాటు. క్షవరం చేయించుకొంటున్న వ్యక్తితో, విడవకుండా మాట్లాడే క్షురకర్మకారునిలా రసూల్ గూడా తన ఆటోలో ప్రయాణించే వాళ్ళతో నోటికి విశ్రాంతి నివ్వకుండా మాట్లాడుతాడు. మాట్లాడకుండా ఉంటే ఏదో ఒక క్షణంలో కన్నుమూతలు పడి ఆటోకు యాక్సిడెంట్ అవుతుందేమో నన్నభయం అతనిలో ఉండి ఉండవచ్చు. తమిళ, హిందీ భాషల్ని అతను బాగా మాట్లాడుతాడు. కొద్దిగా బట్లర్ ఇంగ్లీషులో గూడా అతనికి ప్రవేశముంది.

రసూల్‌కు పెద్ద వయసు లేదు. ప్రస్తుతం అతని వయసు ఇరవై ఏడుగాని, ఇరవై ఎనిమిదిగాని అయి ఉండవచ్చు. సేలంలో జన్మించిన రసూల్‌కు అక్కడ తన బంధువు ఎవరైనా మిగిలి ఉన్నారా లేదా అన్న విషయం తెలియదు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన తాను, ఎట్లా జీవించి వృద్ధి చెందిందీ అతనికి తెలియదు. చదివింది అయిదో తరగతే అయినా తమిళంలో వ్రాయటానికి, చదవటానికీ అతనికెటువంటి ఇబ్బందీ లేదు. హిందీలో, ఉర్దూలో మెల్లమెల్లగా అతను మాట్లాడ గలగటమేగాక, ఇంగ్లీషులో ఎవరైనా ఏదైనా అడిగినా అతను అసమగ్రంగా సమాధానమీయగలడు. పద్దెనిమిది సంవత్సరాల వయసులో మద్రాసుకు వచ్చి యూనిఫారం లేని పోర్టర్‌గా సెంట్రల్ స్టేషన్‌లో పనిచేసినప్పుడు ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. ఆ కష్టకాలంలోనే రసూల్‌కు యూనిఫారం ఉన్న పోర్టర్ సత్తార్‌తో పరిచయం ఏర్పడింది. సత్తార్‌పట్ల రసూల్‌కు వల్లమాలిన అభిమానముండటానికి కారణం, ఎస్.ఎస్.ఎల్.సి ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడైన తర్వాత సత్తార్ ఈ పోర్టర్ పనిలో ఉన్నాడు. మద్రాసు మహానగరంలోనే అతనికొక చిన్న స్వగృహం ఉంది. ఇంట్లో అతనితోపాటు అతనికన్నా అయిదు సంవత్సరాల చిన్న చెల్లాయి మాత్రం ఉంది. అప్పుడప్పుడు రసూల్ ఆ ఇంటికి వెళ్ళటం ఆపాప 'సుబైదా' స్వహస్తాలతో చేసిన రుచికరమైన భోజనాన్ని తినటం జరుగుతూ ఉండేది. కాలం గడుస్తున్న కొద్దీ సత్తార్ రసూల్‌ల మధ్య ఉన్న స్నేహబంధం పెరిగి పెరిగి వాళ్ళు ప్రాణ స్నేహితులైనారు.

అయిదారు సంవత్సరాల క్రితమే సత్తార్‌కు సెంట్రల్ రిజర్వు పోలీస్‌ఫోర్స్‌లో ఉద్యోగం వచ్చింది. మద్రాసు విడిచి వెళ్ళేముందు అతని వయసేగల రసూల్ బలిష్టమైన హస్తాలలో తన చెల్లెలు భవిష్యత్తును భద్రపర్చటం జరిగింది. వాళ్ళ నిక్కాహ్ జరిగేటప్పుడు రసూల్ వయసు ఇరవై రెండైతే సుబైదా వయస్సు పద్దెనిమిది సంవత్సరాలు. సత్తార్ తన చిన్న ఇంటితోపాటు, అంతపెద్ద పాతదిగాని ఒక ఆటోనుకొని కట్నం రూపంలో రసూల్‌కు ఇవ్వటం జరిగింది. దేశరక్షణ విధిలో పాల్గొనేముందు తన చెల్లాయిని ఒక మంచి మిత్రునికిచ్చి వివాహం చేసినందుకు అతనికెంతో తృప్తిగా ఉంది.

ఈవిధంగా గత అయిదారు సంవత్సరాల నుండీ ఆటోరిక్షా నడుపుతూ జీవిస్తున్నాడు రసూల్. దాని నుండి ఒకమోస్తరు ఆదాయం వస్తుందని చెప్పితే అందులో అవాస్తవం ఏమీ లేదు. కాని రకరకాల ఖర్చులూ ఉన్నాయి. ఇవ్వాల్సిన మామూళ్ళన్నీ అయిష్టతతో ముఖం చిట్లిస్తూ గాక మామూలుగానే ఇచ్చివేయాలనీ, కానప్పుడు ఎక్కువ కష్టాలెదుర్కోవాల్సి వస్తుందన్న విషయం అతనికి బాగానే తెలిసొచ్చింది. ఆటోరిక్షా సర్వీసులో అతనికి చాలా సంతోషం కల్గించిన విషయం ఏమిటంటే, ఈ వృత్తిలో ఎంతోమంది అపరిచితులలో పరిచయం కలగటమేగాక, చాలాసేపు వాళ్ళతో మాట్లాడే అవకాశం ఏర్పడటం. ఉత్తరభారతీయులు, సమీపంలోని తెలుగు, కన్నడ, కేరళ ప్రాంతాలవాళ్ళే గాక, ఎంతోమంది విదేశీయులు గూడా తన ఆటోరిక్షాలో ప్రయాణిస్తున్నారనీ, వాళ్ళందరితో మాట్లాడుతుంటే తన లోకజ్ఞానం గూడా బాగా అభివృద్ధి చెందుతున్నందుకు అతనికి సంతృప్తిగా ఉంది. అప్పుడప్పుడూ కొన్ని చేదు అనుభవాలు ఎదురైనా అవీ జీవితంలో ఒక భాగమేగదా అని సమాధానపడేవాడు.

కానీ, ప్రొహిబిషన్ రోజుల్లో జరిగిన ఒక దుర్ఘటన రసూల్‌ను, అతని భార్యను నిస్తేజితుల్ని చేసింది. ఇంతటి దారుణమైన అనుభవం ఆ మంచి వ్యక్తి జీవితంలో జరిగి ఉండాల్సింది కాదు. ''మానవులారా, ఈ లోకంలో నరకాన్నైనా, నాకాన్నైనా సృష్టించేది మీరే'' అని చెప్పినట్లు కొందరు రాక్షసప్రవృత్తి గలవారే రసూల్ శారీరకంగా, మానసికంగా కృంగిపోయే ఆ సంఘటనకు కారకులైనారు.

ఒకరోజు, ఢిల్లీ నుండి వచ్చిన ప్రయాణీకుణ్ణి తన ఆటోలో కూర్చోపెట్టుకొని స్టేషన్ నుండి బయటకు వస్తున్నాడు రసూల్. కొందరు నిషేధ అధికారులు ఆ ఆటోరిక్షాను ఆపి అందులోని ప్రయాణీకుడి సూట్‌కేసును తనిఖీ చేయసాగారు. అందులో ఒక విస్కీ బాటిల్ దొరికింది. ఆప్రయాణీకుణ్ణి జీపులోకి ఎక్కించి ఆ అధికారులు తీసుకుపోయారు. ఆటోరిక్షాలో మరో నిషేధకుడు కూర్చొని ఆజీపు వెనుకనే పోనీయమని రసూల్‌ను

ఆదేశించాడు. తర్వాత సంభవించిన విషయాలు ఆ ప్రయాణీకుడుగానీ, రసూల్‌గానీ కలలోనైనా ఊహించనివి. ఆ ప్రయాణీకుడొక స్మగ్లరేమోననీ రసూల్ ఆ స్మగ్లర్ల సంఘానికి ఏజంటేమోనన్న సందేహ నివృత్తి కార్యక్రమంలో ఇద్దరూ దారుణమైన హింసకు గురయ్యారు. ఒకరోజులోనే వాళ్ళిద్దర్నీ జైలుకు పంపటం గూడా జరిగింది. ఆటోరిక్షాను ప్రభుత్వానికి జప్తు చేస్తారని భయపెట్టటంతో తన సర్వస్వం కోల్పోయినట్లు రసూల్ బిగ్గరగా రోదించటం జరిగింది.

రసూల్ ఇంటి విషయాలు ఇప్పటివరకూ ప్రస్తావించలేదు కదా! అతని వివాహం జరిగి ఇప్పటికి ఒక పంచవర్ష ప్రణాళిక పూర్తై ఉంటుంది. ఈ గడువులో వాళ్ళకు ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి కలిగారు. ఆటోరిక్షా ద్వారా వచ్చే ఒక్క ఆదాయంతో, ఆ పంచ సభ్యులుగల కుటుంబ ఖర్చులు కష్టంగా గడిచిపోతూ ఉండేవి. ఇహ పిల్లల్ని స్కూలుకు పంపించేటప్పుడు ఇంకెన్ని ఖర్చులు పెరుగుతాయోనని ఆదంపతులు కలత చెందేవారు. అయినా గాని కాశ్మీర్ ఆపిల్ పండ్లవంటి ఆ పిల్లల్ని చూసినప్పుడు వాళ్ళకు అవధుల్లేని ఆనందం కలిగేది.

ఆ రాతంత్రా నిద్రపోకుండా భర్త కోసం ఎదురుచూసింది 'సుబైదా' చాలారోజులు అర్ధరాత్రి తర్వాతే అతను ఇంటికి వచ్చేవాడు. రెండో ఆట సినిమా తర్వాత డబుల్ చార్జి చెల్లించటానికి ఎవరూ అభ్యంతరం చెప్పరుగనుక ఆటో డ్రైవర్లకు ధనం అధికంగా దొరుకుతుంది. భార్యా పిల్లలకోసం ఎంత కష్టపడటానికైనా, ఎన్ని త్యాగాలు చేయటానికైనా అతను సిద్ధంగా ఉన్నాడు. అతని ప్రాణానికి ప్రాణమైన సుబైదా పిల్లల్ని నిద్రబుచ్చి ఎంత రాత్రైనా అతనికోసం ఎదురుచూసేది. అతను వచ్చిన తర్వాతనే అతనితో కల్సి రాత్రి భోజనం చేసేది. రోజూ తెల్లవారుజామున నాలుగు, నాలుగున్నరకే అతను బయటకు వెళ్ళిపోతాడు.

రాత్రంతా ఏమీ తినకపోయినా ఆమె బాధపడలేదుగానీ, భర్తకేమైందోనన్న ఆందోళన ఆమె మనసును కదిపివేసింది. గతంలో ఏనాడూ అతను ఇంటికి రాకుండా లేడు. అయ్యో... ప్రమాదమేదైనా...

రాత్రంతా నిద్రలేనందువల్ల ఎర్రబడ్డ కళ్ళల్లో ఉదయమైనా గూడా నిద్రవచ్చే సూచనలేవీ కన్పించటం లేదు. భయాందోళనలో దహించుకుపోతున్న ఆమెకు ఏమి చేయాలో, ఎవరివద్దకు పోవాలో, పోలీస్ స్టేషన్‌కు పోయి రిపోర్ట్ చేయాలో వద్దోగూడా పాలుపోలేదు. ఉదయం ఇరుగు పొరుగువారు వచ్చినపుడు ఆమె విలపిస్తూ విషయమంతా వారికి చెప్పింది. వాళ్ళెంత ఓదార్చటానికి ప్రయత్నంచేసినా ఆమెలో క్షణక్షణానికీ ప్రాణశక్తి హరించుకుపోసాగింది.

ఏడున్నరగంటల సమయంలో రసూల్ మిత్రుడు ఆర్ముగం వచ్చి జరిగిన విషయమంతా ఆమెకు తెలియజేశాడు. అది విన్న ఆమెకు భయమైతే కల్గిందిగాని, రసూల్‌కు ప్రాణాపాయం ఏదీ కలగనందుకు కొంత ఊరట లభించింది. భర్తను చూడటానికి ఆర్ముగం ఆటోరిక్షాలో తన ముగ్గురు పిల్లల్ని తీసుకొని ఆమె వెంటనే బయలుదేరింది. కొద్దిసేపు రసూల్‌తో మాట్లాడటానికి ఆ నిషేధ అధికారులు ఆమెను అనుమతించారు. ధైర్యంగా ఉండమని సుబైదాకు చెప్పి, ఆమెను పిల్లల్నీ ఆటోరిక్షాలో ఇంటివద్ద దించిరమ్మనమని ఆర్ముగంను కోరాడు రసూల్.

ఆ రోజుగూడా పచ్చి మంచినీళ్ళు తప్ప సుబైదా వేరే ఏమీ తీసుకోలేదు. మరుసటి రోజు ఉదయం తొమ్మిది గంటలకు ఆర్ముగం మళ్ళీ వచ్చాడు. తినటానికి కొన్ని పండ్లు, ఫలహారాలు గూడా తీసుకువచ్చాడతను. పెద్ద పిల్లలిద్దరూ వాటిని ఆవురావురుమంటూ తింటే, ఆరు నెలలు మాత్రమే వయసున్న కడగొట్టు పాపకు సుబైదా తినిపించింది.

ఎంత బలవంతం చేసినా సుబైదా మాత్రం ఏమీ తీసుకోలేదు.

గత దినం జరిగిన సంఘటనలన్నీ ఆర్ముగం ఆమెకు వివరించాడు. ఆటోరిక్షా యూనియన్ కార్యవర్గసభ్యులు కొందరు ఆ నిషేధ అధికారులను, మేజిస్ట్రేట్‌ను కలిసి జామీన్‌కోసం ప్రయత్నించారని, ఏమీ ఫలితం లేకపోగా, ఆ ప్రయాణికుడితోపాటు రసూల్‌కు గూడా జైలుకు పంపటం జరిగిందనీ ఆర్ముగం తెలియజేయగా ఆమె పెద్దగా విలపించింది. తనకాళ్ళు పట్టుకొని ప్రాధేయపడినందున, సుబైదాను, పిల్లల్ని తన ఆటోరిక్షాలో జైలుగేటు వరకు తీసుకువెళ్ళాడు ఆర్ముగం. కొందరు యూనియన్‌సభ్యులు ప్రయత్నించినా రసూల్‌ను చూడటానికి జైలు అధికారులు ఆమెకు అనుమతి నీయలేదు. ఏడ్చి ఏడ్చి నిర్జీవంగా మారిన ఆమె అక్కడే ఉన్న ఒక చెట్టుకింద కూలబడింది. ఇంటికి తీసుకువెళ్ళటానికి, ఏదైనా ఇంత తినిపించటానికి ఆ యూనియన్ సభ్యులు ఎంతప్రయత్నించినా శోకించటం మినహా ఆమె ఏ సమాధానమీయలేదు. సాయంత్రం కాగానే ఆమెకు తోడుగా ఉండటానికి ఆ యూనియన్ సభ్యుల ఇంటి వయసుమళ్ళిన స్త్రీలు ఇద్దరు, ముగ్గురు వచ్చి కూర్చున్నారు. వాళ్ళు కూర్చోటానికి జంపకానాలు వేయటంగూడా జరిగింది. అక్కడింకా అవసరమైంది ఒక టెంట్ మాత్రమే. కానీ అందుకు పోలీసులు ఒప్పుకోరన్న సంగతి వాళ్ళకు బాగా తెలుసు. చీకటిపడేసరికి అక్కడికొక పోలీస్ వ్యాను వచ్చింది. సామధాన భేద తంత్రాలద్వారా అక్కడ ఉన్న ఆడవాళ్ళను వెడలనంపటానికి పోలీసులు ప్రయత్నం చేశారు గానీ తమకంటే ముందుగా తమమీదనే ఆటోరిక్షా యూనియన్ సభ్యులు దండన మంత్రం ప్రయోగిస్తారేమోనని భయపడి వీరోచితంగా,

యుక్తి యుక్తంగా వెనుదిరిగి వెళ్ళారు. ఆరోజంతా గూడా సుబైదా నిరాహారంగానే ఉండిపోయింది. రాత్రంతా ఇద్దరు పురుషులు వాళ్ళకు కాపలాగా ఉన్నారు.

తెల్లవారుజామున సుబైదాను లేపటానికి చెంత ఉన్న స్త్రీలు ప్రయత్నం చేశారు. ఆమెలో కదలిక లేదు. ఆమె స్పృహ కోల్పోయిందని తెల్సుకొని దగ్గర్లో ఉన్న ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకుపోవటం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రులు అంత పెందలాడే నిద్ర లేవవని వాళ్ళకు బాగా తెల్సు.

ఈ సంకట పరిస్థితుల్లోనే రాయడు రంగప్రవేశం చేయటం జరిగింది.

ఈ రాముడంటే ఎవరూ?

రాయడుకు మరో పేరు దీనబంధు. మద్రాసులో ఎక్కువమందికి తెల్సింది ఈ రెండో పేరే. బాగా ఆస్తిపాస్తులున్న ఇతనికి రెండువమూడు పరిశ్రమలేగాక, కొన్నిచోట్ల పొలాలుగూడా ఉన్నాయి. రాయుడు స్వగ్రామం ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో ఉన్నా, అతని తల్లిదండ్రులు వ్యాపార నిమిత్తం మద్రాసుకు వచ్చి రెండు చేతులా సంపాదించారని అందరూ చెప్పుకొంటారు. రాయుడు సాధుస్వభావి, దైవభక్తుడేగాక మంచి స్నేహశీలి గూడా. నిరుపేదల సహాయార్థం తన ఆదాయంలో ఒక పెద్ద భాగం అతను ఖర్చు పెట్టటం ప్రారంభించి ఇరవై అయిదు సంవత్సరాలైంది. ఒక పెద్ద ఆలయాన్నిగూడా అతడు నిర్మించాడు. చాలా కాలం క్రిందటే ఒక అనాధాశ్రమాన్ని గూడా అతను స్థాపించాడు. దీనజనుల ఉద్ధరణకోసం తన శక్తిమేర సహాయం చేస్తూ వస్తున్నాడు. ఈ సత్కార్యాల కోసం స్నేహితులు, అభిమానులు గూడా అతనికి ధనరూపేణా సహకరిస్తున్నారు. పీడితజనుల కోసం ఒక 'లీగల్ సెల్'ను గూడా అతడు నడిపిస్తున్నాడు. దీనిలో ఇరువురు న్యాయవాదులు, కొందరు సేవాభావంగల ఉద్యోగులు స్థిరంగా పనిచేస్తున్నారు. ఇటువంటి ఒక ఉద్యోగి సుబైదా దీనగాధను విని రాయుడుకు తెలియజేయటం జరిగింది.

సుబైదాను ఆసుపత్రిలో జేర్చిన రోజు ఉదయం తొమ్మిది గంటలకు రాయుడు అక్కడకు రావటం జరిగింది. అప్పటికి సుబైదా స్పృహలోకి వచ్చిందిగాని ఏమీ తినటానికి అంగీకరించక కన్నీరు కారుస్తూ ఉండిపోయింది. రాయుడు ఆమె దయనీయ స్థితిని చూచి, ఆమెకు ఇంట్రావీనస్ ద్వారా గ్లూకోజ్ ఎక్కించమని డాక్టరును కోరాడు.

అక్కడే ఉన్న ఆర్ముగంను పిలిచి రాయుడు పూర్తి వివరాలు తెల్సుకొని సుడిగాలిలా బయటకు వెళ్ళాడు. ఒక లాయర్‌ను వెంటబెట్టుకొని రసూల్ ఆటోను స్వాధీనం చేసుకొన్న నిషేధ అధికారుల వద్దకు వెళ్ళాడు రాయుడు. సాక్షాలన్నీ పకడ్బందీగా ఉన్నందున తామేమీ

చేయలేమనీ, అసలు ఇటువంటి ప్రొహిబిషన్ కేసుల్లో బయటివారు జోక్యం చేసుకోరాదనీ ఆ నిషేధ అధికారులు నిక్కచ్చిగా రాయుడికి తెలియజేశారు. ఎన్ని విధాలుగా నచ్చచెప్పినా, ఎంత వాదించినా ఆపాషాణ హృదయాల చెవికెక్కలేదు. కొద్దిగా మానవతావాద దృష్టితో చూడగూడదా అని కోరినప్పుడు, చట్టానికి కళ్ళుండవు అని ఆ అధికారులు అన్నారు. చట్టంకాదు గుడ్డిది, మీ కళ్లకే పొరలుగమ్మాయి అంటూ లాయర్ హెచ్చు స్వరంతో పలుకుతుండగా, రాయుడు అతన్ని శాంతపరచి ప్రక్కకు తీసుకువెళ్ళి తదనంతర కార్యక్రమాల గూర్చి చర్చించాడు.

జామీన్‌మీద రసూల్‌ను బయటకు తీసుకు రావటానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. త్వరలోనే కేసు నా ముందుకు వస్తుందిగదా అని అంటూ మేజిస్ట్రేట్ తప్పించుకున్నాడు.

సుబైదాను, పిల్లల్ని వాళ్ళ ఇంటికి తీసుకువెళ్ళి వాళ్ళతో అన్ని విషయాలు సుదీర్ఘంగా మాట్లాడాడు రాయుడు. ఆమె ఏమీ తినకుండా ఉండటంవల్ల ఎటువంటి ప్రయోజనం లేదనీ, రసూల్‌కు జైలులో మూడు పూటలా తిండి పెడుతున్నారనీ, వీలైనంత త్వరలో అతన్ని జామీన్‌మీద తీసుకు రావటానికే ప్రయత్నాలు చేస్తున్నామని రాయుడు బోధ చేయటంతో సుబైదా మనసుకు కొంత ఊరట లభించినట్లైంది. దైనందిన ఖర్చుల కోసం కొంత ధనాన్ని గూడా ఆమె చేతిలో పెట్టాడతడు.

కేసు విచారణ సమయంలో రసూల్ పక్షాన చాలా ఘనంగా వాదించాడు లాయర్. ప్రాసిక్యూషన్ తరుపున గూడా రసూల్‌కు కఠిన శిక్ష విధించాలనీ, అతని ఆటోరిక్షాను ప్రభుత్వానికి ముట్టచెప్పాలనీ అంతే గట్టిగా వాదించటం జరిగింది. ఈ వాదనకు తగ్గట్టుగా రాయుడు లాయర్ గూడా ఈవిధంగా వాదించాడు.

''రైల్వే స్టేషన్‌లలో చాలా ఆటోరిక్షాలుంటాయి. ట్రైన్ వచ్చినప్పుడు ఆ ఆటోరిక్షా లన్నింటికీ గిరాకీ ఉంటుంది. ఆటోరిక్షా ఎక్కేముందు ప్రయాణీకుడి సూట్‌కేస్ తెరిచి చూపమని అడిగే అధికారం ఆటోరిక్షా డ్రైవర్‌కు ఉండదు; ఒకవేళ ఉన్నా అందుకు ప్రయాణీకుడు అంగీకరించడు. మద్యాన్ని తరలించటానికి ఈ ఆటోరిక్షాను ఉపయోగించారన్న వాదన హేతుబద్ధమైంది కాదు. ఈ నెపంతో ఆటోరిక్షాను జప్తు చేయాలని చూడటం అన్యాయమేకాదు, క్రూరంగూడా. రసూల్ చేయని నేరానికి అతని జీవనోపాధిని హరించటం మానవతా రహితమైన కార్యం. ఒక ప్రయాణీకుడి సూట్‌కేస్ లోపల ఒక బాటిల్ మద్యం ఉందని ఆటోరిక్షానే జప్తు చేయవచ్చుననుకొంటే, ఇహ అన్ని రైళ్ళనూ జప్తు చేయవలసి వస్తుందే! ఇట్లా సూట్‌కేసులు సోదా చేసే కార్యక్రమం మొదలుపెడితే రైళ్ళల్లో ఎన్నో మద్యం సీసాలు దొరుకుతై. ఈ కారణంతో కనీసం ఒక

ట్రైన్‌ను అయినా ఇంతవరకు జప్తు చేశారా? ఈ పద్ధతిలో ఒక్క ట్రైన్‌ను జప్తు చేయగలిగితే డిపార్ట్‌మెంట్‌కే కాదు, న్యాయస్థానానికి గూడా ఎంతో పబ్లిసిటీ లభిస్తుంది. కానీ, దురదృష్టవశాత్తు ఇంతవరకూ ఒక్క ఆర్.టి.సి. బస్సైనా ఈ కారణంతో జప్తు చేయటం జరగలేదు. ప్రభుత్వ వాహనాల్లో మద్యాన్ని తరలించటం నేరం కాదా?... నిషేధ అధికారులు వాహనాలను జప్తు చేయబూనటం మరెందుకో కాదు; ప్రభుత్వ కోశాగారాన్ని నింపటానికే. ఇటువంటి దుర్మార్గ ప్రవృత్తి అధికారులకు పురస్కారాలు, అడ్డదారి ప్రమోషన్లు రావటం సహజమే. ఇటువంటి దురాశాపరులకు, ఒక బీదకుటుంబాన్ని బజారుపాల్జేయటానికి ఎటువంటి సంకోచమూ ఉండదు. ఎందుకంటే అంతరాత్మ అనేది వాళ్ళకు ఉండదు గనుక!''

రసూల్ పక్షాన ఇంత సమంజసమైన వాదన జరిగినా అతన్ని విడుదల చేయటానికి మాత్రం మేజిస్ట్రేట్‌కు భయంగానూ, సందేహంగానూ ఉండేది. కానీ రాయుడు లాయర్ మాత్రం సామాన్యుడా? ఈ కేసు విషయంలో అవసరమైతే సుప్రీంకోర్టుకు గూడా వెళ్ళటానికి తాను సిద్ధంగా ఉన్నానని నిషేధాధికారులనూ, ప్రాసిక్యూషన్ వారినీ, ప్రాసిక్యూషన్ వారిద్వారా మేజిస్ట్రేట్‌నూ బెదిరించటానికి సైతం అతను వెనుకంజ వేయలేదు.

చివరకు మేజిస్ట్రేట్ చాంబర్‌లోకి రాయుడు లాయర్‌ను పిలిపించటం జరిగింది. ఏమాత్రం బిడియపడకుండా తన భయాల్నీ, సంకోచాల్నీ మేజిస్ట్రేట్ అతనికి తెలియజేయటం జరిగింది. రసూల్‌ను విడుదల చేస్తే డిపార్ట్‌మెంట్ వారినుండి తనకు అపకారం జరుగుతుందనీ, అందువల్ల ఆటోరిక్షా జప్తు చేయకుండా, ఒక వెయ్యి రూపాయలు జుల్మానా విధించి రసూల్‌ను ఇంటికి పంపిద్దామని ఎంతో వినయంగా అతనికి విశదం చేశాడు మేజిస్ట్రేట్. జుల్మానా మొత్తాన్ని తగ్గించమని కోరటం అనవసరమని భావించి రాయుడు లాయర్ అందుకు అంగీకారం తెల్పుతూనే ఆ వెయ్యి రూపాయల్ని కట్టి ఆనరక యాతనల్నుండి రసూల్‌కు విముక్తిని కల్గించాడు.

ఆతర్వాత ఈ కేసు విషయం ప్రొహిబిషన్ మంత్రితో చర్చించాడు రాయుడు. ఇటువంటి ఘోరప్రవర్తనకు ఇహముందు పాల్పడకుండా ఆ మంత్రివర్యులు ఒక సుదీర్ఘమైన సర్క్యులర్‌ను నిషేధాధికారులకు పంపినట్లుగా తెలియవచ్చింది.

నిరుపేదలకు ఎటువంటి న్యాయం లభించనప్పుడు ఆపత్కాలంలో వారిని ఆదుకోవటానికి రాయుడువంటి దైవదూతల్ని ఈ భూతలంమీదకు తరచుగా పంపమని మనమందరం ఆ దైవానికి నివేదన చేద్దామా?

(5-10-1995 నాటి ఆంధ్రభూమి సచిత్ర వార పత్రికలో ప్రచురితం)